అభివృద్ధికి శ్రీకారం


క్రైస్తవుల శ్మశాన వాటిక రక్షణ గోడ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

- జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో అభివృద్ధి పనులకు భూమిపూజ
- పనుల్లో నాణ్యత పాటించాలి
- 41వ వార్డు కార్పొరేటర్ పూర్ణిమా శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో అభివృద్ధి పనులకు, రక్షణగిరిలో క్రైస్తవుల శ్మాశనవాటిక రక్షణగోడల నిర్మాణానికి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ అర్బన్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ మంగళవారం భూమిపూజ చేశారు. సుమారు రూ. 9.2 లక్షల వ్యయంతో ఈ పనులు పూర్తి చేయనున్నారు. ఈ సందర్భంగా కోడిగుడ్ల పూర్ణిమ మాట్లాడుతూ వార్డుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన సమస్యలను గుర్తించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ముందుగా సెయింట్ పీటర్స్ కెథడ్రల్ విచారణ గురువులు కుమార్ ప్రార్థన చేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏఈ సతీష్, సచివాలయ కార్యదర్శి చాందిని, వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, వేళంగిణీరావు, ప్రసాద్, కమల్ కుమార్, అన్నపూర్ణ, దేవి, కల్యాణ్, శ్రీను, సత్యనారాయణ, ప్రభాత్, ఆనంద్, సునీల్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

వేతనాలు చెల్లించాలంటూ డిప్యూటీ సీఎంకు వినతి


వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మహారాణిపేట : దిశ వన్ స్టాప్ సెంటర్ (సఖి) ఉద్యోగులకు బకాయి ఉన్న 10 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ తరఫున వినతిపత్రం సమర్పించారు. మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకురాలు మణి, వన్‌స్టాప్ సెంటర్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. 11 సంవత్సరాల క్రితం వన్ స్టాప్ సెంటర్ (సఖి)లో కాంట్రాక్ట్ పద్ధతిలో నియమితులయ్యారని, నాటి జీతాలే నేటికీ ఇస్తున్నారని యూనియన్ నాయకురాలు మణి వివరించారు. ఇది కూడా ఎప్పుడు బడ్జెట్ వస్తే అప్పుడు ఇస్తున్నారని తెలిపారు. గత నవంబర్ నుంచి ఇప్పటి వరకు 10 నెలలు జీతాల ఇవ్వలేదన్నారు. గత 2 సంవత్సరాలుగా తమకు సక్రమంగా బడ్జెట్ విడుదల చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, దిశ ఉద్యోగులు కె.కుసుమ, జేఎస్‌కేఆర్ అరుణ, ఎస్.దేవి, జి. రాజేష్, డి.అప్పలరాజు, జి.కొండలరావు, ఎం.వెంకటరావు, టి. అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన


ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి

డాబాగార్డెన్స్ : ఈ నెల 10 నుంచి 19 వరకు తిరుపతిలో నిర్వహించిన ఎన్‌సీసీ, సీఏటీసీ–వి (టీఎస్‌సీ–ఐజీసీ) క్యాంపు ముగించుకుని విశాఖ చేరిన క్యాడెట్లను విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ భావం, దేశభక్తి, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె. గీతాంజలి, పి. సంతోషి, సీహెచ్ లక్ష్మి, పల్లవి, సీహెచ్ మల్లేశ్వరి, ఐ. తులసి, గాయత్రి, ఎస్. కిరణ్మయి, సీహెచ్ సాహితి, పలువురు క్యాడెట్లు పాల్గొన్నారు.

వృద్ధురాలి అప్పగింత


వృద్ధురాలిని గోల్డేజ్ హోం ప్రతినిధికి అప్పగిస్తున్న పోలీస్

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి శ్రీనగర్‌లోని గోల్డేజ్ రిటైర్మెంట్ హోమ్స్ నుంచి ఒక వృద్ధురాలు ఎవరికీ తెలియకుండా బయటికి రావడంతో స్థానికులు ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్‌కు తెలియజేశారు. భీమిలికి చెందిన వృద్ధురాలు ఐదు నెలలుగా ఈ హోంలో ఉంటున్నారు. మంగళవారం వృద్ధురాలు భీమిలి వెళ్లేందుకు రామా టాకీస్ వద్దకు ఆటో కోసం రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు ఫోర్తుటౌన్ పోలీసులకు తెలిపారు. వెంటనే పోలీసులు వచ్చి గోల్డేజ్ హోం నిర్వాహకులకు వృద్ధురాలిని అప్పగించారు. నిర్వాహకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన


నరసింహనగర్ రైతుబజార్‌లో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సీతంపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 ప్రచారంలో భాగంగా భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కళాకారులు మంగళవారం నరసింహనగర్ రైతుబజార్‌లో 'ప్లాస్టిక్‌తో ప్రమాదం' అనే వీధి నాటిక ప్రదర్శించారు. పాలిథిన్ బ్యాగుల వినియోగం, ప్లాస్టిక్ వల్ల కలిగే ముప్పును వివరించారు. కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నానాజి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి షష్టి పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో శ్రావణ మాస శుద్ధ షష్టి మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన


దొండపర్తి ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి పరదేశమ్మ గుడి వద్ద ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించాలని, 42వ వార్డు పరిధిలోని సీసీ రోడ్లు, డ్రైనేజీకి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించాలని వార్డు నాయకుడు ఆళ్ల శ్రీనివాస్ కోరారు. అనకాపల్లిలోని సత్యనారాయణపురంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం అర్జీలు స్వీకరించి, మంజూరు చేయాలని జీవీఎంసీ అధికారులను కోరారు. కరెంట్ సమస్యలపై వినతులు రావడంతో ఏపీఈపీడీసీఎల్ అధికారి మహేంద్రనాథ్‌తో మాట్లాడారు. విశాఖ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని కోరగా జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే నిర్ణీత రుసుముతో, అద్దె ప్రాతిపదికన అందించాలని కోరారు. అలాగే పలు సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, డైరెక్టర్లు పి.అమ్మాజీ, ఎస్.ప్రసాదరావు, అజయ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం మహాభాగ్యం


వినయ్ సింగ్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: మానసిక ఆరోగ్యం కలిగి ఉండడం మహాభాగ్యమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో మంగళవారం నిర్వహించిన 'అడ్వాన్సెస్ ఇన్ కాగ్నెటివ్ సైన్సెస్– బెటర్ ఫ్యూచర్ ఫర్ ఏజింగ్ అండ్ న్యూరో డైవర్స్ పీపుల్' అంశంపై జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ సంబంధాలలో మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. సంతోషంగా జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. విదేశాల్లో వయోవృద్ధులు సైతం ఎవరిపైనా ఆధారపడకుండా స్వశక్తితో జీవించడం, పనిచేయడం స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. సమ వయస్కుల నుంచి వస్తున్న ఒత్తిడి యువతలో ఆత్మహత్యలను ప్రేరేపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి పాఠశాలలో సైకాలజీ కౌన్సెలర్ అవసరం ఉందన్నారు. బాల్యం, పెరిగిన విధానం, విలువల వ్యవస్థ, సామర్థ్యాలు, జ్ఞాపకశక్తి, సాఫ్ట్ స్కిల్స్ వంటివి వ్యక్తి ప్రగతిని ఎంతగానో ప్రభావితం చేస్తాయన్నారు. కెనడాలోని ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ సీఈవో డాక్టర్ వినయ్ సింఘ్ మాట్లాడుతూ మానవ మస్తిష్కంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఏయూతో సంయుక్తంగా పరిశోధనలు జరపడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ రోజూ ఆస్పత్రికి పదుల సంఖ్యలో చిన్నారులు వివిధ మానసిక సమస్యలతో వస్తున్నారని, వీరికి అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలకు మూలాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 14 శాతం మంది వృద్ధులు ఉన్నారని, 2030 నాటికి వారి జనాభా 30 శాతానికి పెరుగుతుందన్నారు. ప్రస్తుతం భారతీయుల జీవన కాలం 67సంవత్సరాలు మాత్రమేనని, ఇది మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ రాధాకృష్ణ, విభాగ విద్యార్థులు, పరిశోధకులు, సైకాలజీ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘనంగా నివాళులు


గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న ప్రజా నాట్యమండలి సభ్యులు

అల్లిపురం: ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు ప్రజానాట్య మండలి ఘనంగా నివాళులర్పించింది. మండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రజా కళాకారుడు గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా గద్దర్ చిత్రపటానికి ప్రజా నాట్యమండలి సీనియర్ నాయకుడు అరుణజీ, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జిల్లా అధ్యక్షుడు జి.రమణ బద్రి కూర్మారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాజువాక మహిళల బృందంచే కోలాటం, లక్ష్మీ భవనం డ్యాన్స్ స్కూల్ పిల్లలచే శ్రమ జీవే జగతికి మూలం, పాడుదమా స్వేచ్ఛాగీతం డాన్సులు, అభ్యుదయ కవులు, కళాకారులచే పలు గీతాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గద్దర్ నిత్యం తన పాట ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నాయకులు చిరంజీవి అప్పన్న, అల్లూరి విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక విభాగం కన్వీనర్ దండు నాగేశ్వరరావు, విశాఖ గద్దర్ రత్నం, భీమసేన రవి సిద్దార్థ, బహుజన కళామండలి ఉదయ భాస్కర్, సినీ నటుడు రవితేజ, లక్ష్మీనారాయణ, వై.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ద్రోణంరాజు ఇంట్లో 'నల్లారి'


ద్రోణంరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

ఏయూ క్యాంపస్: దివంగత మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు ఇంటికి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు శ్రీనివాసరావు కుమారుడు శ్రీవాత్సవ్, ఇతర కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. ద్రోణంరాజు సత్యనారాయణ, శ్రీనివాసరావులతో తనకున్న అనుబంధం, వివిధ సంఘటనలను ఆయన గుర్తు చేసుకున్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ప్రజాదర్బార్‌లో వచ్చిన వైద్య సమస్యల పరిష్కారం దిశగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చర్యలు చేపట్టారు. నేరుగా బాధితుల ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. 38వ వార్డు బుక్కావీధిలో ఉంటున్న సూరాడ తమ్మయ్య చేపల వేట సమయంలో అనారోగ్యంతో చనిపోయినట్టు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ద్వారా తెలుసుకుని మంగళవారం వారి ఇంటికి వెళ్లి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 39వ వార్డు పాత పోస్టాఫీస్ కన్వేయర్ బెల్ట్ సమీపాన నివసిస్తున్న పార్టీ సీనియర్ కార్యకర్త పిల్లా శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ పోషణ కష్టంగా ఉందని ప్రజాదర్బార్‌లో విజ్ఞప్తి చేయగా, ఎమ్మెల్యే పిల్లా శ్రీను ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సనపల రవీంద్రభరత్, సంకాభక్తుల సన్యాసిరావు, బెహర వెంకటరత్నం, ముజీబ్‌ఖాన్, లండా రమణ, ఆదివిష్ణు, టీకే ప్రసాద్, తిత్తి కృష్ణ, మాధురి, శ్రీను, ఆదినారాయణ, ఆరుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతాలు


అల్లిపురం గౌరీ గవర సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళల పూజలు


విశేష అలంకరణలో వరలక్ష్మీ దేవి

అల్లిపురం : శ్రావణ మాసం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలో పలు చోట్ల మహిళలు మంగళ గౌరీ వ్రతాలు నిర్వహించారు. బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు వంద మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. వేంకటేశ్వరమెట్టలోని శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం, గౌరీ మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయం ఆవరణలో మంగళ గౌరీ వ్రతాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అల్లిపురం గౌరీ గవర సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వ్రతంలో మహిళలు ఘనంగా అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మహిళలతో పాటు భీశెట్టి హనుమంతరావు, భీశెట్టి నరసింహమూర్తి (శ్రీను), పెంటకోట రఘు, కర్రి శ్రీనివాసరావు, యల్లపు సప్తగిరి, పిల్లా రామారావు, యల్లపు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి


శ్రీలక్ష్మీ పూజల్లో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్ : నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

6వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు మంగళవారం 6వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

24న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 24న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఇవో పేర్కొన్నారు.

శుభప్రదం.. వరలక్ష్మీ వ్రతం

మాసాలన్నింటిలోనూ మంగళప్రదమైనది శ్రావణమాసం. ఈ మాసంలో శ్రావణలక్ష్మి సర్వాభరణాల అలంకరణలో తేజోవంతంగా భక్తులకు సాక్షాత్కరిస్తుంది. ముత్తైదువుల మనోభావాలకు, సంపద, సౌభాగ్యాలకు ఈ మాసం మహోదయం. అత్తవారిళ్లలో కొత్తకోడళ్ల కొంగొత్త ఆశలకు ఈ మాసం ఆశాజనకం. ఆషాఢం అడ్డంకులు అధిగమించాక కొత్త దంపతుల ఆనందప్రదమైన జీవితాలకు చంద్రోదయం.

- 25న శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు
- కళకళలాడుతున్న మార్కెట్లు




కళకళలాడుతున్న కంచరపాలెం మార్కెట్, వ్రతాల్లో పూలందుకుంటున్న వరలక్ష్మి

కంచరపాలెం : మహిళలకు శుభప్రదమైన శ్రావణ మాసంలో మంగళ, శుక్రవారాల్లో ముత్తైదువులు ఇళ్లను పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. శ్రావణమాసానికి పదిహేను రోజుల ముందు నుంచే వస్త్ర దుకాణాలు, బంగారం షాపులు కొనుగోలు దారులతో కిటకిటలాడతాయి.

నూతన వస్తువులు, వస్త్రాలతో సందడి..

వివాహితలు విధిగా వారి స్తోమతను బట్టి కొత్త చీరలు కొని, శ్రావణ లక్ష్మికి చూపించి కట్టుకుంటారు. బంగారం ధర చుక్కల్ని తాకుతున్నా కొని శ్రావణలక్ష్మికి చూపించి ధరించడం అనాదిగా వస్తున్న ఆచారం. శ్రావణమాసం సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో వస్త్ర, బంగారు దుకాణాలు మహిళలతో కళకళలాడుతున్నాయి.

మంగళగౌరీ వ్రతాలు..

ఈ మాసంలో దేవాలయాలు, అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడుతుంటాయి. నిత్యం విశేష పూజలతోనూ, కుంకుమార్చనలతోనూ విరాజిల్లుతాయి. ప్రధానంగా కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, మర్రిపాలెం, మురళీనగర్, మాధవధార, అక్కయ్యపాలెం, సీతంపేట, సీతమ్మధార, జ్ఞానాపురం, ఎన్ఏడీ కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాలు అమ్మవారికి మంగళగౌరీ వ్రతాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయి.

పిండి వంటల ఘుమఘుమలు..

ఈ మాసంలో ప్రతి ఇంట మంగళ, శుక్రవారాల్లో పిండి వంటల ఘుమఘుమలు నోరూరిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు ఎలా ఉన్నా అనాదిగా వస్తున్న ఆచారాన్ని అంతా తప్పక పాటిస్తారు. ఇరుగు పొరుగు వారికి పంచుకుని సంప్రదాయాన్ని చాటుకుంటారు.

ధరలు పెరిగినా పూజలు తప్పవు..



సంప్రదాయానికి చిహ్నంగా జరుపుకునే పండగల్లో వరలక్ష్మి వత్రం ఒకటి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పండగలు చేసుకోవడం తప్పదు. మార్కెట్‌లో ఏ వస్తువు కొనాలన్నా విపరీతంగా రేట్లు పెంచి విక్రయిస్తున్నారు. దుస్తులు, లక్ష్మీ కాసులు అన్నింటి ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి.
– ఉప్పాల కల్యాణి , ఐటీఐ జంక్షన్

సాంప్రదాయం ఉట్టిపడుతోంది..



వరలక్ష్మి వ్రతం అంటేనే మహిళల పండగ. సాంప్రదాయం ఉట్టిపడే ఈ పండగ రోజుల్లో ప్రతి ఇల్లు ఒక దేవాలయంలా మెరిసిపోతుంది. మంగళ, శుక్రవారాల్లో మంగళగౌరీ వ్రతాలతో ఆధ్యాత్మికత ఉట్టి పడుతుంది.
– కె.లతశ్రీ, కంచరపాలెం

అలరించిన 'భారత ప్రశస్థి' పద్య రూపకం


పద్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: శ్రీలలితాపీఠం ఆధ్వర్యంలో విశాఖ సాహితి సహకారంతో పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి సమక్షంలో నన్నయ మహాభారత రచన సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా భారత ప్రశస్థి అనే పద్య రూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో రాజరాజ నరేంద్రుడిగా డాక్టర్ పేరి రవికుమార్ (విశాఖ), నన్నయగా డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ (నరసాపురం), తిక్కనగా శ్రీకోట వెంకటలక్ష్మీ నరసింహం (తణుకు), ఎర్రనగా తాత సత్య సందీప్ శర్మ(విశాఖ),నారాయణబట్టుగా ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ (హైదరాబాద్) నన్నయ భారత రచన ప్రస్థానాన్ని అలాగే రాజరాజ నరేంద్రుడి ప్రోత్సాహాన్ని పద్య రూపకంలో కడు రమ్యంగా ప్రదర్శించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా విశాఖసాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని వ్యవహరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, విశాఖ సాహితి కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్న వ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.